క్లుప్తంగా

రూ.2 లక్షల విరాళం

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త సల్గూటి విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం గ్రామ విద్యాభివృద్ధి కమిటీకి రూ.2లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఉండాలన్నారు. మన గ్రామ పాఠశాలలను మనమే అభివృద్ధి పరుచుకోవాలన్నారు. అందుకు తన వంతుగా పాఠశాలల అభివృద్ధికి రూ. 2లక్షలు విరాళంగా అందించినట్లు తెలిపారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు

నవాబుపేట: గ్రామాల్లో అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వివిధశాఖల మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో పంచాయతీ అధికారులు టార్గెట్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈనెల 31నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఏపీఓ జ్యోతి, బద్రునాయక్ ఉన్నారు.

ముందస్తు వేతనాలివ్వాలి

భూత్పూర్: ఉగాది, రంజాన్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ముందుస్తుగా ఈనెల 25లోగా వేతనాలు అందించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు మహ్మద్ సాదిక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల చివర్లో రెండు ముఖ్య పండుగలు ఉన్నందున వేతనాలు ఇవ్వాలని కోరారు.

బొటానికల్ గార్డెన్‌లో 'విశ్వశాంతి' విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సోమవారం అలంపూర్ విశ్వశాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు 30మంది సందర్శించారు. బాటనీ అధ్యాపకురాలు శశికళ ఆధ్వర్యంలో వారు గార్డెన్‌ను సందర్శించి గార్డెన్ వివరాలు తెలుసుకోవటంతో పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. వారికి గార్డెన్‌ సమన్వయకర్త డా. సదాశివయ్య పూర్తి వివరాలు తెలిపారు. జీవ వైవిద్య పరిశోధన కేంద్రాన్ని, ఇటీవల పట్టుకున్న పాములను చూసి విద్యార్థులు ఆనందపడ్డారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కి చెందిన సత్యంయాదవ్ ఇటీవల చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్. రాజశేఖర్‌రెడ్డి అతడిని ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆర్థికసాయం అందజేశారు.

'హక్కులు తెలుసుకోవాలి'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను తప్పకుండా తెలుసుకుని, నాణ్యమైన వస్తువులు కొనాలని సూచించారు. వస్తువుల కొనుగోళ్లలో మోసాలకు తావు లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదన్‌శర్మ, శ్రీదేవి, కిషోర్ పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వొద్దు

దేవరకద్ర: మండలంలో మీనుగోపల్లిలోని వాగు నుంచి ఇసుకను తరలించడానికి అనుమతి ఇవ్వొద్దని పలువురు రైతులు సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇసుక రిచ్‌కు అనుమతి ఇవ్వడంతో వాగు నుంచి ఇష్టానుసారం ఇసుకను తరలిస్తారని, దీంతో వాగులో ఉన్న బోర్లు అడుగంటిపోయి వరి పంటలన్నీ ఎండిపోయే అవకాశం ఉందని రైతులు వాపోయారు. ఎట్టి పరిస్థితిలో ఇసుక తరలించడానికి అనుమతి ఇవ్వరాదని రైతులు కోరారు.

'ఆలయ పవిత్రతను కాపాడుకుందాం'

స్టేషన్ మహబూబ్‌నగర్: జోగుళాంబ శక్తిపీఠం ఆలయ పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడు, హైందవ సంఘాలకు ఉన్నాయని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం పాలమూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఐద శక్తిపీఠం జోగుళాంబ దేవస్థానంలో జరుగుతున్న సంఘటనలపై చర్చించారు. రాఘవేంద్రశర్మ, శ్రీకాంత్‌శర్మ, పరశురామ అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు జోషి సంతోషాచార్యులు, ప్రదీప్, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేకపూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని షిర్డీ సాయిబాబ ఆలయ 17వ వార్షికోత్సవాన్ని సోమవారం ప్రధాన పూజారి వి.వి.రమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వ్రతాలతో పాటు అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

నాణ్యత పాటించాలి

కలెక్టర్ విజయేందిరబోయి


కలెక్టర్ విజయేందిర ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజావాణి ఫిర్యాదుదారుడు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంబలి తయారీలో నాణ్యత పాటించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అంబలి, చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ప్రజావాణికి వచ్చిన ఓ ఫిర్యాదుదారుడితో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో అంబలి ఆరోగ్యానికి చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రాజశేఖర్, అక్రమ్, చంద్రయ్యపాల్గొన్నారు.

పోషణ్ కిట్లు పంపిణీ

టీబీ రోగులకు నిక్షయ్ పోషణ్ కిట్లను కలెక్టర్ విజయేందిర పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో లోక్ భారతి ఎడ్యుకేషన్ సొసైటీ, ఆరగెన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టీబీ రోగులకు కిట్లను కలెక్టర్ అందించి మాట్లాడారు. ప్రతీ రోగికి కిట్లు అందేలా చూడాలన్నారు.

అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలి

మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి గండేడ్ మండల బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డిపల్లి, ధర్మాపూర్, అన్నారెడ్డిపల్లి, వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుంటే సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.అలాంటి వ్యక్తులపై, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పెంట్యానాయక్, వెంక ట్రాంరెడ్డి, రాములు, రాజ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్‌లైన్ పాఠశాలలో ఏఐ ల్యాబ్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్ పాఠశాలలో కలెక్టర్ విజయేందిర బోయి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, బాలుయాదవ్, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, హెచ్‌ఎం జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో పండుగలు జరుపుకొందాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ.వెంకటేశ్ తన నివాస గృహంలో సోమవారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్పీ.వెంకటేశ్ మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని, వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆనవాయితీని ఇలాగే కొనసాగించాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లో కులమతాలకతీతంగా అన్నివర్గాల ప్రజలు ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా పర్వదినాలు జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఏపీ మిథున్‌రెడ్డి, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, అవేజ్ అహ్మద్, అజ్మత్‌అలీ, ఫయాజ్, సాయిబాబా, షబ్బీర్, అంజద్, రాషెద్‌ఖాన్, ఖాజపాష, లక్ష్మణ్‌నాయక్, అర్షద్‌అలీ, నవనీత, నయీం, షాఫైసల్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ రాష్ట్రఅధ్యక్షుడు కృష్ణముదిరాజ్


ఎగ్జామ్ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్‌ను ఆసంస్థ మండలాధ్యక్షుడు పద్మ నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుంటేనే జీవితంలో ఏమైన సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంఈఓ కృష్ణయ్య, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివన్న, శ్రీనివాసులు, రాములు, బుచ్చన్న, శివప్రసాద్, చెన్నయ్య పాల్గొన్నారు.

'స్థానికం'లో గెలుపునకు కృషి చేయాలి


గ్రామ కమిటీ అధ్యక్షులకు నియామక పత్రం అందజేస్తున్న మల్లు నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఫతేపూర్, భవానితండాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఫతేపూర్, భవానితండా గ్రామ అధ్యక్షులుగా రాజుయాదవ్, రవినాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ కమిటీలువేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. శ్రీనివాస్‌యాదవ్, తులసీరాం నాయక్, గోవింద్‌యాదవ్, ఖాజా పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజేను బలోపేతం చేస్తాం


సభ్యత్వాలు పొందిన నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టును(ఐజేయూ) జిల్లాలో బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆయూనియన్ రాష్ట్ర నాయకుడు అహ్మద్ పాషా అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయూనియన్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. జిల్లాలో టీయూడబ్ల్యూజేను పటిష్టపరిచేందుకు 2025–26కి పలువురు జర్నలిస్టులు తమసభ్యత్వాలను నమోదు చేసుకుంటున్నారన్నారు.మొదటిరోజునే 60మంది జర్నలిస్టులు సభ్యత్వాలను పొందారు. జిల్లా అడ్‌హాక్ కమిటీ సభ్యులు శేఖర్, ముజీబ్, వెంకటయ్య, వెంకటేష్, వెంకట్, శేఖర్, పవన్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, తిరుపతయ్య, శంకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, రవి, వెంకటేష్, జయాకర్‌గౌడ్, ఫోటోజర్నలిస్టులు రాజు, మధు, సందీప్‌రెడ్డి, నర్సింగ్ రెడ్డి, నగేష్, రాంకొండ, మోహన్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



జడ్చర్ల టౌన్: మండలంలోని లింగంపేట గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు జగన్ మాట్లాడుతూ గ్రామంలో 4, 7వ వార్డుల్లో నాలుగేళ్లుగా మురికికాల్వలు నిర్మించకుండా ఉండటంతో మురికినీరు రోడ్లపైనే పారుతూ దోమలతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. నాయకులు యాదయ్య, శ్యాంసుందర్, నారాయణ, బాలమణి, హంసమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్ గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు గ్రామ నాయకులు తెలిపారు. అంగన్‌వాడీ భవనం, యాదవ కమిటీ హాల్ నిర్మాణాలకు మరో రూ. 23 లక్షల నిధులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంజూర్ చేశారని వారు తెలిపారు. చిన్నయ్య, నాయకులు రాజుగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

45వ డివిజన్ పరిధిలో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 45వ డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్క గల్లీలో వేస్తున్న సీసీ రోడ్ల పనులను సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం ఒకటో డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరకాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్లను తనిఖీ చేశారు.

కాకర్లపహాడ్‌లో..

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో సోమవారం ఎంపీ డీకే అరుణ ద్వారా మంజూరైన రూ.16 లక్షలవిలువైన ఎస్ఆర్‌ఈజీఎస్ సీసీ రోడ్డు పనులను గ్రామస్తులు ప్రారంభించారు. నరేందర్, రమేష్, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలతోనే..

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధుల ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేపూర్ గ్రామంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకె అరుణ మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. కొండా బుచ్చిరెడ్డి, అంజయ్య, వెంకటయ్య, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమణారెడ్డి, ఉరుమా రెడ్డి, భూపతిరెడ్డి, కృష్ణార్జున్, రఘురాంగౌడ్, డబ్బారాములు, రాజు, వెంకట్‌రాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయ్

- పెండింగ్ వేతనాలివ్వకపోతే సమ్మె
- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కార్మికుల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ ముందు పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, లేనిచో సమ్మెలోకి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్మికులకు నెలకు రూ.60 కోట్లు ఇచ్చేందుకు గతి లేదా అని ప్రశ్నించారు. జీతం వస్తేనే బతికే కష్టజీవులు గ్రామ పంచాయతీ కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. 15 రోజుల్లో పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే కార్మిక వర్గం అంతా సమ్మెలోకి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్, పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ, బాలు, నాగరాజు, దేవమ్మ, సూర్యమ్మ, నరసింహా, బాలరాజు, వినోద్, షఢక్, అరుణ, బాలయ్య, వాసమ్మ, అంజయ్య, రాజు, లక్ష్మణ్, సత్యం, తిమ్మయ్య, వెంకట్రాములు, చెన్నయ్య, అంజి, బాలమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ నెల నుంచి వేతనాలు బకాయి ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన నవాబ్‌పేట్ మండలం గురుకుంట గ్రామ పంచాయతీ వర్కర్ రంగమ్మ కుటుంబానికి రూ.2లక్షలు చెల్లించాలని కోరారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కమర్ అలీ, జాంగీర్, విష్ణు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వర్ల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నవాబుపేట: మండలంలోని ఆదిబసవేశ్వర దేవాలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం పార్వతీపరమేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన డా. శ్రీనివాస్, సరస్వతీ దంపతులు పట్టువస్త్రాలు, తాళి, తలంబ్రాలతో పార్వతీపరమేశ్వర్ల కల్యాణం జరిపించారు. అనంతరం అమ్మవారికి తలంబ్రాలు, ఒడిబియ్యం పోసే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారం రోజులుగా సాగిన ఉత్సవాలు కల్యాణం అనంతరం చేపట్టిన మహా మంగళ హారతితో ముగిశాయి. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, చంద్రశేఖర్, సత్యం,ప్రతాప్, నాని, పూజారి శ్రీశైలం, రాజలింగం, జంగయ్య, సత్యం, లింగం, వెంకటయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సలు

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్


వివరాలు వెల్లడిస్తున్న సంపత్‌కుమార్

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో హైరిస్క్ సర్జరీలు సైతం విజయవంతంగా పూర్తి చేస్తున్నామని. తాజాగా స్కల్‌బెస్ సర్జరీ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లికి చెందిన ఏసయ్య అనే వ్యక్తి చెవి బొన్‌కు సమస్య రావడంతో మొదట కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి వెళ్లగా అక్కడ సాధ్యం కాకపోతే ఈనెల 12న జనరల్ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. అతనికి పరీక్షలు చేయగా చెవి వెనుక ఎముక భాగంలో ఇన్ఫెక్షన్ ఏర్పాడి బ్రెయిన్ వరకు వ్యాప్తి చెందినట్లు గుర్తించి సబ్‌టోటల్ పెట్రోసెక్టామీ అనే అత్యంత అరుదైన శస్త్రచికిత్స ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిచేశామన్నారు. ఈ సర్జరీ బయట ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే రూ.10లక్షల ఖర్చు అవుతుందన్నారు. జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసినట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్ మాట్లాడుతూ మండలంలోని కోటకదిరకు చెందిన లక్ష్మమ్మ కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే పరీక్షలు నిర్వహించగా చిన్నపేగుల మధ్యలో మూడు నుంచి నాలుగు కేజీల బరువు కల్గిన కణితి ఉన్నట్లు గుర్తించి ఈనెల 11న సర్జరీ చేసి తొలగించామన్నారు. సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ జరీనా, అనస్థీషియా వైద్యురాలు మాధవి, డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- పది విద్యార్థులకు వీడ్కోలు


కోడ్గల్ హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జడ్చర్ల టౌన్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం మండలంలోని గంగాపురం, కోడ్గల్ జెడీహెచ్‌ఎస్‌లలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. తాము ఎంత ఎదిగినా గురువుల వద్ద ఒదిగే ఉంటామని విద్యార్థులు ప్రకటించగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గురువులు కోరారు. గంగాపురం, కోడ్గల్‌లో హెచ్‌ఎంలు అనంతప్ప, మారేపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోడ్గల్‌లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైతులను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ అన్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసిన సీపీఎం ప్రతినిధి బృందం పంటలు ఎండిపోతున్న విషయాన్ని వివరించారు. మూడు రోజులుగా హన్వాడ మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి పంటగా వరి, టమాట, వంకాయ, పశుగ్రాసం పంటలు సాగు చేస్తున్న రైతుల పొలాలను పరిశీలించారు. హన్వాడ మండలంలోని యారోనిపల్లి, తిరుమలగిరి, మునిమోక్షం, అమ్మాపూర్, అంబటోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లోని రైతులతో మాట్లాడగా గత సంవత్సరం సాగుచేసుకున్న మాదిరే ఈ సారి సాగు చేశామని, ఈ సంవత్సరం బోరుబావులు ఎండిపోయి నీరు అందడంలేదని తెలిపినట్లు పేర్కొన్నారు. రాములు, కిల్లెగోపాల్, ఎ.లక్ష్మయ్య పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలోని బొల్లారం గ్రామ పరిసరాల్లో వేసిన వరి పంటను తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శరత్ సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు పంటలకు అందుతుందా.. లేదా అనే విషయంతోపాటు నీటిని వృథా చేయకుండా కింద ఉండే భూములకు చేరుతున్నదా అనే విషయంలో పంట పొలాల్లో ఉండే కాల్వలను పరిశీలించారు. యాసంగి కింద సాగు చేసిన వరి రైతులతో అధికారులు మాట్లాడారు. ఎప్పటి వరకు పంటలు చేతికి వస్తాయనే విషయమై రైతులతో ఆరా తీశారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



జడ్చర్ల టౌన్: వర్గీకరణ అమలు తరువాతే గ్రూప్ ఉద్యోగాలు భర్తీచేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా లసోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కొద్దిసేపు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చట్టబద్ధత తీసుకురాకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అయితే మంగళవారం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతున్నందున దీక్షలను విరమించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్వాల్‌రెడ్డి దీక్ష చేస్తున్న వారిని కోరారు. అనంతరం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్యతో కలసి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలకు బీఆర్‌ఎస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జంగయ్యమాదిగ, నాయకులు కొంగ శివనాగరాజు, కరాటేశ్రీను, వినోద్‌కుమార్, కందూరి యాదయ్య, దేపల్లి రాజేష్ పాల్గొన్నారు.

లవకుశ నాటక ప్రదర్శన



దేవరకద్ర: మండలంలో అడవి అజిలాపూర్ గ్రామంలో శ్రీరామచంద్ర లవకుశ నాటక ప్రదర్శనను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంతో ఇష్టపడే ఈ నాటికను ప్రదర్శించడానికి పలువు సహకారం అందించారని నిర్వాహకులు తెలిపారు. జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ నాటక ప్రదర్శనను ప్రారంభించిన సందర్భంలో పలువురు గ్రామపెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. నాటకాలకుగ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఆదరణ ఉందని రాజశేఖర్ తెలిపారు. మాజీ సర్పంచ్ చిన్నయ్య, నాయకులు జి.రాములు, బాల్‌రాజు, ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఎదుట ఆందోళన

జడ్చర్ల: మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామ శివారులోని బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఎదుట చుట్టుపక్కల గల గిరిజన తండాల ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమ నుంచి వెదజల్లుతున్న వ్యర్థవాయువులను పీల్చడంతో అనారోగ్యం బారినపడుతున్నామని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి


కలెక్టరేట్ గేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం తక్షణమే ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల వ్యతిరేక విధానాలను మానుకొని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, ఉపాధ్యక్షురాలు కమల మాట్లాడుతూ మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీఓజారీ చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరదగాలన్న, కేవీపీఎస్ ఎస్ నాయకులు ఆదివిష్ణు వర్ధన్, ఆవాజ్ నాయకులు జాంగిర్ పాల్గొన్నారు.